క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త, జాబితాపూర్‌కు చెందిన రాజేశ్ అనే వ్యక్తి ఇటీవల గుండెపోటుతో మరణించగా, బాధిత కుటుంబ సభ్యులను, గుల్లపేట గ్రామానికి చెందిన మెడపట్ల లక్ష్మణ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, వారి కుటుంబ సభ్యులను బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పరామర్శించారు. ఆయన వెంట ఎంపీటీసీలు సురేందర్‌రెడ్డి, సునీత, నాయకులు తిరుపతి, రాజిరెడ్డి ఉన్నారు.

మిషన్ భగీరథ సర్వే పరిశీలన



సర్వే పరిశీలిస్తున్న డీఎల్పీవో కనకదుర్గ

కథలాపూర్: మండలంలోని ఊట్‌పెల్లి, భూషణరావుపేట, కథలాపూర్ గ్రామాల్లో మిషన్ భగీరథ సర్వేను జగిత్యాల డీఎల్పీవో కనకదుర్గ బుధవారం పరిశీలించారు. గ్రామాల్లో ప్రతీ ఇంటికి వెళ్లి నల్లా కనెక్షన్ల గురించి వివరాలు సేకరించాలన్నారు. మరోవైపు గ్రామాల్లో పారిశుధ్య పనుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటిపన్ను వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. ఆమె వెంట కార్యదర్శులు ఎం.డీ గఫూర్, ఆనంద్ ఉన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



కూల్చివేస్తున్న అధికారులు

కోరుట్ల: పట్టణంలోని సర్వే నంబర్ 537లో నాలా వెంట అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాన్ని బుధవారం మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి ఆధ్వర్యంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణాల్లో తప్పకుండా నిబంధనలు పాటించాలని కోరారు. 2019 నూతన చట్టం ప్రకారం అక్రమ కట్టడాలను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే తొలగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రవీణ్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

ధర్మపురి: పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ధర్మపురి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాంనర్సింహారెడ్డి అన్నారు. ధర్మపురి పోలీస్ స్టేషన్లో బుధవారం శాంతి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ మత సామరస్యానికి నిలయమైన ధర్మపురిలో హిందూ, ముస్లింల పండుగలను ఐక్యత్యంతో పండుగలను జరుపుకోవాలని సూచించారు. బక్రీద్ పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని కోరారు. ఎస్సై ఉదయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

రాయికల్: ఫొటోగ్రాఫర్లపై భౌతికదాడిని నిరసిస్తూ బుధవారం రాయికల్ పట్టణంలోని విఘ్నేశ్వర ఫొటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించి స్థానిక గాంధీ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఫొటోగ్రాఫర్‌పై దాడిచేసిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తాళ్ల సురేశ్, కోశాధికారి రాజేందర్, ఉపాధ్యక్షుడు శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కల్తీ నిరోధక శాఖ అధికారుల తనిఖీ

మెట్‌పల్లి: పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద ఉన్న ఓ కిరాణ దుకాణంలో బుధవారం ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్యాకింగ్ నిబంధనలు పాటించకుండా విక్రయిస్తున్న కుడుక పాడితో పాటు పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. గతంలో విధించిన జరిమానా చెల్లించాలని వ్యాపారికి సూచించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



సారంగాపూర్-లక్ష్మీదేవిపల్లి అటవీప్రాంతంలో చెట్లు, విద్యుత్ స్తంభాలకు తెల్లరంగులు



రహదారి వెంట ఏర్పాటు చేసిన హజార్డ్ మార్కర్

- సారంగాపూర్ రోడ్డు మార్గంలో డబుల్ రోడ్డుకు మరమ్మతు
- 24 కిలోమీటర్ల వరకు పూర్తి
- హెచ్చరిక బోర్డులు, ప్రమాద సూచికలు ఏర్పాటు

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల ప్రధాన రహదారి డబుల్ రోడ్డుకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. రెండు మండలాల మధ్య 24 కిలోమీటర్ల పొడవుతో ఉన్న డబుల్‌రోడ్డుకు మరమ్మతులు చేపట్టి, ప్రమాదాల నివారణకు రోడ్లు భవనాల శాఖ చర్యలు చేపట్టింది. జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల మీదుగా మంచిర్యాల జిల్లా జన్నారం డబుల్‌రోడ్డు చిన్నా, పెద్ద వాహనాలతో ఎప్పుడు రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డు అస్తవ్యస్తంగా మారి గతంలో చాలా ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. జగిత్యాల రూరల్ మండలం తిప్పన్నపేట, గోపాల్‌రావుపేట నుంచి బీర్‌పూర్ మండల కేంద్రం వరకు 24 కిలోమీటర్ల పొడవుతో ప్యాచ్ వర్క్‌లు పూర్తి చేశారు. వాహనదారులకు సౌకర్యంగా ఉండేందుకు రోడ్డు వెంట హెచ్చరికల బోర్డులు, ఇతర ప్రమాద సూచికలు ఏర్పాటు చేశారు. సారంగాపూర్-లక్ష్మీదేవిపల్లి గ్రామాల మధ్య రోడ్డు వెంట 2.80 కిలోమీటర్ల పొడవు, బీర్‌పూర్ ఘాట్‌పై ఒక కిలోమీటరు పొడవు అటవీప్రాంతం ఉంది. సారంగాపూర్ రోడ్డు వెంట పలు టేకు వృక్షాలు రోడ్డును ఆనుకుని ఉన్నాయి. వీటితో పాటు విద్యుత్ స్తంభాలు రోడ్డు వెంట ఆనుకుని ఉండడంతో చాలాసార్లు ద్విచక్రవాహనదారులు వీటిని ఢీకొని చనిపోతున్నారు. ఇటీవల ఒకరు చనిపోగా, చాలా మంది గాయపడ్డారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆర్‌అండ్‌బీ శాఖ రోడ్డు వెంట ఉన్న వృక్షాలకు, విద్యుత్ స్తంభాలకు, కల్వర్టులు, స్పీడు బ్రేకర్లకు, జీబ్రా క్రాసింగ్ లైన్లకు, ఇతర అవసరం ఉన్న చోట తెల్లరంగులు వేశారు. సారంగాపూర్ అటవీప్రాంతంలో కల్వర్టు ఒక వైపు కూలిపోగా దీనికి సైతం పూర్తిస్థాయి మరమ్మతులు పూర్తి చేశారు. రోడ్డు మెయింటనెన్స్ కింద ప్యాచ్ వర్క్‌లతో పాటు, ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంచాలి



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మి

జగిత్యాలరూరల్: రైతులకు కావాల్సిన పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంచాలని జగిత్యాల మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు సూచించారు. ఇన్‌చార్జి ఎంపీపీ ములాసపు లక్ష్మి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో మోతె ఎంపీటీసీ రొండి రాజ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంచాలని, వ్యవసాయాధికారులు విత్తనాల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీపీ ములాసపు లక్ష్మి మాట్లాడుతూ తిప్పన్నపేటలో శ్మశానవాటికలో నీటివసతి లేక స్నానాలు చేసేందుకు గోదావరికి వెళ్లాల్సి వస్తోందన్నారు. ఐకేపీ కొనుగోలు కేంద్రం వద్ద కాంపౌండ్ వాల్ నిర్మించి భూకబ్జా కాకుండా చూడాలన్నారు. గ్రామంలో బీసీ కాలనీలో మురికికాలువలు లేక నీరు నిలిచి దుర్వాసన వస్తుందని, వెంటనే డ్రెయినేజీ నిర్మించాలని కోరారు. మోతె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్‌నర్సు, ల్యాబ్‌టెక్నీషియన్ లేక మోతెతో పాటు, చుట్టుగ్రామాల ప్రజలు ఆరోగ్య పరీక్షల కోసం కల్లెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాల్సి వస్తుందని, వెంటనే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ధరూర్ నుంచి వయా గొల్లపల్లి, మోతె మీదుగా వెళ్లే బైపాస్‌రోడ్ మరమ్మతుల కోసం నిధులు మంజూరైన కాంట్రాక్టర్ పనులు చేపట్టడం లేదని మోతె ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి సభ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సమావేశంలో ఎంపీడీవో విజయలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత



ఎల్వోసీ అందజేస్తున్న విప్ అడ్లూరి

గొల్లపల్లి: మండలంలోని శంకర్‌రావుపేట గ్రామానికి చెందిన గోలి బాలకిషన్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వ విప్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను ఆశ్రయించగా, రూ.65 వేల ఎల్వోసీ మంజూరు చేయించారు. బుధవారం ఎల్వోసీని బాధితుడి తండ్రి గోలి రాజేందర్‌కు అందజేశారు. కార్యక్రమంలో నరసాని రాజ్యలక్ష్మి, తిరుపతిరెడ్డి, మహేశ్, వెంకటేశ్, శేఖర్ పాల్గొన్నారు.

కండక్టర్‌ను కొట్టిన వ్యక్తిపై కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాల కొత్తబస్టాండ్‌లో ఆర్టీసీ కండక్టర్‌ను అకారణంగా కొట్టిన కంచి కిషన్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు. బాన్సువాడ మండలం కొత్తబాద్ గ్రామానికి చెందిన కలకుంట శంకర్ ఆర్మూర్ డిపోలో ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వరంగల్ నుంచి జగిత్యాల బస్టాండ్‌కు రాగా, బస్సులో ప్రయాణిస్తున్న కంచి కిషన్ అనే వ్యక్తి కండక్టర్ శంకర్‌ను దుర్భాషలాడుతూ కొట్టాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కంచి కిషన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బస్టాండ్‌లో హోంగార్డుపై కత్తితో దాడి

కోరుట్ల: కోరుట్ల బస్టాండ్‌లో బుధవారం రాత్రి అనుమానాస్పదంగా తిరుగాడుతున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తిని ప్రశ్నించినందుకు ఆర్టీసీ హోం గార్డు బానోతు సాగర్‌పై దాడికి తెగబడ్డాడు. అప్రమత్తమైన హోంగార్డు తప్పించుకునే యత్నం చేయగా చేతి వేలికి స్వల్ప గాయమైంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కత్తితో దాడికి పాల్పడ్డ నిందితుడు మద్యం మత్తులో ఉండి స్పృహ లేకపోవడంతో పూర్తి వివరాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

కోరుట్ల బస్టాండ్‌లో దొంగతనం

కోరుట్ల: కోరుట్ల ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం మధ్యాహ్నం దొంగతనం జరిగినట్టు ఎస్సై మహమ్మద్ ఆరిఫొద్దీన్ తెలిపారు. మెట్‌పల్లిలోని గాజుల పేటకు చెందిన తెడ్డు మేఘన పుట్టినిల్లయిన కథలాపూర్ మండలం తక్కళ్లపల్లికి వెళ్లింది. తిరిగి మెట్‌పల్లి వెళ్లేందుకు కోరుట్ల బస్టాండ్‌లో దిగి బ్యాగ్ చూసుకుంది. అందులో నాలుగు తులాల బంగారు, ఆరు తులాల వెండి ఆభరణాలు కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడినట్లు మేఘన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

షెడ్యూల్ ప్రకారం పదోన్నతులు చేపట్టాలి



డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జగిత్యాల: ఉపాధ్యాయుల పదోన్నతులను షెడ్యూల్ ప్రకారమే నిర్వహించాలని యూటీఎఫ్ నాయకులు అన్నారు. బుధవారం డీఈవో జగన్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో పండిట్, పీఈటీ అప్‌గ్రేడ్ కంటే ముందు అన్ని ఖాళీలను సెకండరీగ్రేడ్ టీచర్లతో పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన అడిక్వాసీసీ పూర్తయిన అనంతరం ఓపెన్ మెరిట్ ద్వారా పదోన్నతుల్లో అవకాశం కల్పించాలన్నారు. షెడ్యూల్ ప్రకారమే పారదర్శకంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుకోవెల శ్యామ్‌సుందర్, అంబటి భూమేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మూత పడిన పాఠశాలలు ప్రారంభం



బడిబాటలో ర్యాలీలో చిన్నారులు, అంగన్‌వాడీలు

గొల్లపల్లి: మండలంలోని భీమ్‌రాజ్‌పల్లి, దట్నూర్ ఎస్సీ కాలనీ, అబ్బాపూర్ గ్రామాల్లో మూత పడిన ప్రభుత్వ పాఠశాలలను ఎంఈవో జమునాదేవి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా మూతపడిన పాఠశాలను తిరిగి ప్రారంభించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా అమ్మ ఆదర్శ కమిటీలతో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు పంపించకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు రజిత, శ్యామల, సింగారపు లచ్చయ్య, కొలగాని తిరుపతి పాల్గొన్నారు.

పొలాసలో బడిబాట

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాసలో బుధవారం అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ ప్రీస్కూల్ విద్య అంగన్‌వాడీల్లో అందిస్తున్నట్లు తెలిపారు. 3–5 ఏళ్ల పిల్లలను తల్లిదండ్రులు అంగన్‌వాడీల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు మమత, ఉషా, ప్రభ, శారద, గంగలక్ష్మి పాల్గొన్నారు.

బాలికల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్సీ

సాక్షి స్పందన



అధికారులతో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న బాలికల ఉన్నత పాఠశాలను బుధవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సందర్శించారు. మంగళవారం సాక్షిలో ప్రచురితమైన 'ఏడాది గడిచినా పునాదుల్లోనే' అనే వార్తకు ఎమ్మెల్సీ స్పందించారు. బుధవారం ఉపాధ్యాయులు సిబ్బందితో కలిసి పాఠశాలలో అందుబాటులో ఉన్న తరగతిగదులతో పాటు నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య అందుబాటులో ఉన్న గదులు, మౌలిక సదుపాయాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో టెలిఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాల్సిందిగా సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయ సంఘం నాయకులు దేవయ్య, బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొదటి రోజు విద్యార్థుల హాజరు అంతంతే..

మల్యాల: వేసవి సెలవులు ముగియడంతో బుధవారం పాఠశాలలు తెరుచుకున్నాయి. మొదటి రోజు విద్యార్థుల హాజరు శాతం అంతంతమాత్రంగానే ఉంది. మల్యాల మండలంలో 25 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 11 జిల్లా పరిషత్ పాఠశాలలు, 4 ప్రాథమికోన్నత పాఠశాలలు, మోడల్‌స్కూల్, కస్తూర్బా స్కూల్, తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలల్లో 2,626మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందగా, మొదటి రోజు 937మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు.

తెరుచుకున్న పాఠశాలలు..

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో 42 ప్రభుత్వ పాఠశాలలతో సహా మోడల్ స్కూల్, కస్తూర్బా విద్యాలయం, ఎస్టీ మినీ గురుకుల బాలికల పాఠశాలలు బుధవారం పునప్రారంభమయ్యాయి. పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ లు పంపిణీ చేశారు.

ఇబ్రహీంపట్నం: వేసవి సెలవుల అనంతరం బుధవారం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సరస్వతీ మాతకు పూజలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

ఆహార పదార్థాల నాణ్యత విస్మరిస్తే చర్యలు

కోరుట్ల:ఆహార పదార్థాల నాణ్యతను విస్మరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి అన్నారు. పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లు, స్వీట్ హౌస్‌లు, బేకరీలను మున్సిపల్ సిబ్బంది బుధవారం తనిఖీ చేశారు. అనంతరం నాణ్యత, పరిశుభ్రత లేని హోటళ్లు, రెస్టారెంట్లకు జరిమానా విధించారు. వర్షాకాలంలో అంటువ్యాధులు రాకుండా పరిశుభ్రత పాటించాలని కమిషనర్ తిరుపతి కోరారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ ఆకు అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గో రక్షణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి

ధర్మపురి: గో రక్షణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని వీహెచ్‌పీ నాయకులు బుధవారం డిప్యూటి తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ పండుగల పేరుతో గోవులను అక్రమంగా రవాణా చేస్తూ హతమారుస్తున్నారని గో రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం 1877లో తీసుకొచ్చిన ప్రత్యేక చట్టాన్ని అమలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు పాల్గొన్నారు.

తైబజారు వేలం నిలిపేయాలి

కోరుట్ల: మున్సిపల్ పరిధిలో తైబజారు వేలం నిలిపేయాలని నేషనల్ హాకర్స్ ఫెడరేషన్ పట్టణాధ్యక్షుడు షేక్ షాహెద్ హుస్సేన్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా కోరుట్ల మున్సిపాల్టీలో అధికారులు తైబజార్ వేలం నిర్వహిస్తున్నారన్నారు. ఈ వేలంతో చిరు వ్యాపారుల పొట్టగొట్టడం సరికాదన్నారు. ఏప్రిల్‌లో హైకోర్టులో కేసు దాఖలైందని, దీనిపై తీర్పు రాకముందే తైబజార్ వేలం వేసి చిరు వ్యాపారుల దగ్గర వసూళ్లకు దిగడం విచారకరమన్నారు.కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ముసావీర్, ప్రతినిధులు హన్మక్క, అలువాల లక్ష్మి, ముజీబ్, సుభాన్ పాల్గొన్నారు.

హిందూ భక్తుల బస్సుపై దాడి చేసిన వారిని శిక్షించాలి

జగిత్యాలటౌన్: కాశ్మీర్‌లో హిందూ భక్తులు ప్రయాణిస్తున్న బస్సుపై దాడి చేసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. జమ్ముకాశ్మీర్‌లోని వైష్ణోదేవి కత్రా నుంచి శిఖోడికి వెళ్తున్న హిందూ భక్తుల బస్సుపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ బుధవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బోయిని పద్మాకర్ తుకారాం, గజం రాజు, గోజోజు సంతోష్, మామిడాల రాములు, సీపెల్లి రవీందర్, లింగంపేట శ్రీనివాస్, ఆంకారి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



లచ్చక్కపేటలో బోనాలతో వస్తున్న మహిళలు

రాయికల్: మండలంలోని కిష్టంపేటలో శివభక్త మార్కండేయ స్వామి ఆలయ 10వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం గ్రామంలోని మహిళలతో కలిసి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి బోనం ఎత్తుకుని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలోకమాత పోచమ్మ బోనాలు

సారంగాపూర్: మండలంలోని లచ్చక్కపేటలో శ్రీలోకమాత పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారికి బోనాలు చేశారు. మహిళలు డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు బీజేపీ జగిత్యాల నియోజకవర్గ డాక్టర్ బోగ శ్రావణి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గంగామాతకు బోనాలు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం చింతలపేటలో బుధవారం మహలక్ష్మీ అమ్మవారి,గంగామాత బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బుధవారం డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

సమాచారం..

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న టీజీటీ సాంఘీక శాస్త్ర విభాగంలో గంటల ప్రాతిపదికన బోధించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ నాగసుధారాణి తెలిపారు. సాంఘీక శాస్త్రంలో బీఈడీ, టెట్ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఈనెల 18లోపు తమ దరఖాస్తులను పాఠశాలలో సమర్పించాలని కోరారు. అర్హత, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు.

బీసీ హాస్టల్‌లో ప్రవేశాలకు ..

రాయికల్: పట్టణంలోని బీసీ హాస్టల్‌లో ప్రవేశానికి 3 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని వార్డెన్ వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ హాస్టల్‌లో 70 సీట్లు ఖాళీగా ఉన్నాయని, వివరాల కోసం 9949243467 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

మోడల్ స్కూల్‌లో అధ్యాపకుల ఖాళీల భర్తీకి..

వెల్గటూర్ : మండలంలోని కుమ్మరిపల్లి ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కట్ల శ్రీనివాస్ తెలిపారు. జీవశాస్త్రం, ఇంగ్లిష్ బోధించుటకు పీజీతో పాటు బీఈడీ కలిగి ఉండాలని, హిందీకి బీఈడీ లేదా హెచ్‌పీటీ కలిగి ఉండాలని తెలిపారు. అధ్యాపకులు 6 నుంచి ఇంటర్ వరకు బోధించాలన్నారు. అర్హత కలిగిన వారు ఈ నెల 18వ తేదీ లోపల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని, 18న దరఖాస్తుదారులతో డెమో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

హిందీ టీచర్ పోస్టుకు..

రాయికల్: మండలంలోని ఇటిక్యాల మోడల్‌స్కూల్‌లో ఖాళీగా ఉన్న టీజీటీ హిందీ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీధర్ బుధవారం తెలిపారు. డిగ్రీతో పాటు, హెచ్‌పీటీ, టెట్ పాసై ఉండాలని, ఆసక్తి గల అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లతో ఈనెల 18లోపు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.



కోరుట్ల మండలం పైడిమడుగు హైస్కూల్ 2001-02 బ్యాచ్ పూర్వ విద్యార్థులు



కట్లకుంట జెడ్పీహెచ్‌ఎస్ 2008-2009 పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో బండలింగాపూర్ 2000-01 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

కోరుట్ల రూరల్: మండలంలోని పైడిమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001–2002 సంవత్సరం పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు బుధవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అమ్మవారి ఆలయ ఆవరణలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు చదువు నేర్పిన గురువులను సన్మానించారు.

మెట్‌పల్లిరూరల్: మండలంలోని బండలింగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివిన 2000–2001 బ్యాచ్ విద్యార్థులంతా ఒక్కచోట కలిసి బుధవారం జగ్గాసాగర్ కొండస్వామి దేవస్థానం సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. నాటి మధురస్మృతులను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.

మేడిపల్లి: మండలంలోని కట్లకుంట జెడ్పీఎస్ఎస్ పాఠశాల ఆవరణలో బుధవారం 2008–2009 సంవత్సారానికి చెందిన పూర్వ విద్యార్థులు సమావేశమై ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. చాలా ఏళ్ల తర్వాత కలిసినందుకు ఆనందంగా ఉందన్నారు.